సాక్షి
యాదాద్రి భువనగిరి
శనివారం, 14, జూన్, 2025



సర్కిళ్లకు దేవుళ్ల పేరు

యాదగిరి క్షేత్ర అభివృద్ధిలో భాగంగా కొండ చుట్టూ ఏర్పాటు చేసిన సర్కిళ్లకు దేవుళ్ల పేరు పెట్టారు. - 8లో



స్వర్ణయుగం మళ్లీ వచ్చింది

వైఎస్సార్ హయాం నాటి స్వర్ణయుగం రాష్ట్రంలో మళ్లీ వచ్చిందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. - 9లో



కొనసాగుతున్న యాక్షన్ ప్లాన్

మున్సిపాలిటీల్లో వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పారిశుద్ధ్య పనులు చేపట్టి, ర్యాలీలు తీశారు. - 9లో

న్యూస్‌రీల్

బడిబాట ద్వారా 100 అడ్మిషన్లు

భువనగిరి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ విద్యాసంవత్సరం ఇప్పటి వరకు కొత్తగా 100 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు ఉండగా గత ఏడాది ఏప్రిల్‌లో విద్యా సంవత్సరం ముగిసే నాటికి 260 మంది విద్యార్థులున్నారు. ఈనెల 6వ తేదీ నుంచి నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులు 100 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. పాఠశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య 360కి చేరింది. బడిబాట ఈనెల 19వ తేదీ వరకు కొనసాగనుందని, విద్యార్థుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ తెలిపారు.

కళాశాలల్లో విద్యార్థుల నమోదు పెంచండి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సాక్షి,యాదాద్రి: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థుల నమోదు పెంచాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ విద్యా సంవత్సరం వచ్చిన అడ్మిషన్ల వివరాలను కళాశాలల వారీగా సమీక్షించారు. కళాశాలల్లో అడ్మిషన్ పొందడానికి గడువు ఉన్నందున ఆలోపు టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, బోధన గురించి తల్లిదండ్రులకు వివరించాలని కోరారు. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని, స్లిప్ టెస్టులు నిర్వహించి అందులో వెనుకబడిన విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. విద్యార్థులు ఉన్నతస్థానం వెళ్లేలా నాణ్యమైన విద్యను అందించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓ కృష్ణారెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రమణి పాల్గొన్నారు.

సీఎం కప్ విజేతలకు అభినందన



విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేస్తున్న అదనపు కలెక్టర్

భువనగిరి: హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా రాష్ట్ర స్థాయిలో పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కిక్ బాక్సింగ్ విభాగంలో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం అదనపు కలెక్టర్ వీరారెడ్డి తన చాంబర్‌లో సర్టిఫికెట్‌లు, మెడల్స్ అందజేశారు. ముందుందు జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిలా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజయనేయులు, గ్రాండ్ మాస్టర్ శ్రీనివాస్, మాస్టర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపవర్‌మెంట్ బోర్డు అధ్యక్షుడిగా సత్యనారాయణ



భూదాన్‌పోచంపల్లి: సోషల్ జస్టిస్ అండ్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ బోర్డు రాష్ట్ర అధ్యక్షుడిగా భూదాన్‌పోచంపల్లి పట్టణానికి చెందిన దోర్నాల సత్యనారాయణ నియామకం అయ్యారు. ఈ మేరకు బోర్డు డైరెక్టర్ జనరల్ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సామాజిక న్యాయం, మహిళా సాధికారత కోసం పాటుపడుతానన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో జిల్లా స్థాయి కమిటీలు నియమించి బోర్డును బలోపేతం చేస్తానని పేర్కొన్నారు.



ఆత్మకూర్(ఎం) శివారులో మొలిచిన పత్తి మొక్కలు



మొలకెత్తిన విత్తు


రెండు రోజులుగా కురుస్తున్న చెదురు మదురు వర్షాలకు విత్తనాలు మొలకెత్తుతున్నాయి. మే నెల మూడో వారంలో కురిసిన తొలకరి వానలకు రైతులు పత్తి విత్తనాలు విత్తారు. ఆ తరువాత చినుకు జాడ లేకపోవడం, ఎండ తీవ్రత పెరగడంతో గింజలు మాడిపోయే దశకు చేరాయి. ఈ తరుణంలో అడపాదడపా కురుస్తున్న వర్షాలకు మొలకలు వస్తుండటంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. -ఆత్మకూర్(ఎం)

ఉల్లంఘిస్తే ఏఐ పట్టేస్తుంది!

వాహనదారులపై ఆధునిక పరిజ్ఞానంతో నిఘా

- ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే పట్టుకోవడం, గుర్తించడం ఇక సులువు
- జరిమానాలు, కేసులున్నా, బీమా, ధ్రువీకరణ పత్రాలు లేకున్నా తక్షణమే గుర్తింపు
- వాహన చోరీలకు చెక్
- జిల్లాలో త్వరలోనే వినియోగంలోకి కృత్రిమ మేధ
- ఎంపిక చేసిన ప్రాంతాల్లో కిట్‌ల ఏర్పాటుకు సన్నాహాలు
- సిబ్బందికి శిక్షణ పూర్తి

సాక్షి, యాదాద్రి: ఇప్పటి వరకు ఓ లెక్క... ఇకనుంచి మరో లెక్క. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించే వాహనదారులను గుర్తించడం, పట్టుకోవడం సులువు కానుంది. ఇందుకోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు జిల్లా రవాణా శాఖ సిద్ధమవుతోంది. ఏఐ టూల్స్ వినియోగంపై రవాణాశాఖలోని ట్రాన్స్‌పోర్టు కానిస్టేబుల్స్, ఏఎంవీఐలకు ఇప్పటికే హైదరాబాద్‌లో శిక్షణ పొందారు. జిల్లాలోనూ కృత్రిమ మేధాను వినియోగించేందుకు శిక్షణ తీసుకున్న సిబ్బంది కసరత్తు ప్రారంభించారు. వాహనదారులను క్యాప్చర్ చేసేందుకు ఎక్కడెక్కడ ఏఐ కెమెరాలు, పరికరాలు ఏర్పాటు చేయాలి, ఎంత ఖర్చవుతందనే వివరాలతో రవాణా శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు.



నిత్యం వేలాది వాహనాల రాకపోకలు

జిల్లా మీదుగా హైదరాబాద్- వరంగల్, హైదరాబాద్-విజయవాడ, సంగారెడ్డి - కంది జాతీయ రహదారులు (తుర్కపల్లి, భువనగిరి, చౌటుప్పల్)లతో పాటు రాష్ట్ర రహదారులు ఉన్నాయి. వీటిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. స్థానిక వాహనాలతో పాటు అంతరాష్ట్ర వాహనాలు ప్రయాణిస్తాయి. ప్రస్తుత విధానం ద్వారా వాహనాలను తనిఖీ చేసేందుకు చాలా సమయం పడుతుంది. ఇది ట్రాఫిక్ సమస్యలు తారి తీస్తోంది. అంతేకాకుండా కొందరు మితిమీరిన వేగం, రాంగ్‌రూట్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, హెల్మెట్ ధరించకపోవడం వంటి రూల్స్ ఉల్లంఘిస్తున్నారు. వీటితో పాటు వాహనానికి నంబర్ ప్లేట్ లేకపోవడం, బీమా చేయించకపోవడం, ఫిట్‌నెస్, పొల్యూషన్ సర్టిఫికెట్ పొందకపోవడం, కేసులు, జరిమానాలు, వాహనాల దొంగతనం, దొంగ చాసి నంబర్లు, డాక్యుమెంట్ల ట్యాంపరింగ్ వంటివి ఉన్నాయి. కానీ, చాలా మంది వాహనదారులు వాటిని బేఖాతరు చేస్తున్నారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండిపడటమే కాకుండా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని రవాణా శాఖ గుర్తించింది. వీటికి చెక్ పెట్టేందుకు కృత్రిమ మేధాను వినియోగంలోకి తీసుకువస్తుంది.

ట్యాబ్‌కు క్షణాల్లో సమాచారం

రోడ్లు, కూడళ్లలో ఏర్పాటు చేసిన కెమెరాలు ఆయా మార్గాల్లో వెళ్లే వాహనాల నంబర్ ప్లేట్లను క్యాప్చర్ చేస్తాయి. పన్ను చెల్లించ లేదా, బీమా ఉందా, ట్రాఫిక్ ఉల్లంఘన కేసులున్నాయా.. ఇలా సమాచారమంతా విశ్లేషించి క్షణాల్లో రవాణాశాఖ అధికారుల వద్ద ఉన్న ట్యాబ్‌కు చేరవేస్తాయి. కెమెరాలు ఏర్పాటు చేసిన ప్రాంతానికి దూరంగా ఉన్న అధికారుల ట్యాబ్‌లో వాహననంబర్ కనిపిస్తుంది. దాని ఆధారంగా వాహనదారుడు తమ దగ్గరకు రాగానే ఆపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారు. ఏఐతో రోడ్లపై వాహనాలను ఆపి తనిఖీ చేసే విధానం ఉండదు.

ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో ఏఐ కెమెరాలు

బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా, చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజాతో పాటు జాతీయ రహదారులపై, రవాణా శాఖ కార్యాలయంలో ఆటోమేటిక్ నంబర్‌ప్లేట్ రికగ్నేషన్ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఆ తరువాత జిల్లా వ్యాప్తంగా అవసరమైన చోట ఇంటెలిజెన్స్ ఆర్టిఫిషియల్ పరిజ్ఞానాన్ని విస్తరిస్తారు.

త్వరలోనే వినియోగంలోకి..

ఏఐ త్వరలో వాడుకలోకి రానుంది. ఏఐ కిట్‌ల వినియోగంపై అవగాహన కల్పించడానికి జిల్లాలోని సంబంధిత అధికారులు, కొందరు క్షేత్ర సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. ఏఐ ద్వారా ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించే వాహనదారులను గుర్తించడం, పట్టుకోవడం సులువు కానుంది. వాహనాల చోరీ, దొంగ చాసి నంబర్లు, డాక్యుమెంట్ల ట్యాంపరింగ్, కేసులు, జరిమానా, బీమా తదితర సమాచారాన్ని గుర్తించవచ్చు. ఎంవీఐ, ఏఎంవీఐ, కానిస్టేబుళ్ల వరకు ఏఐపై అవగాహన ఏర్పడింది. ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఏఐ టూల్స్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం.

-సాయికుమార్, జిల్లా రవాణా అధికారి

బాల కార్మిక వ్యవస్థను రూపుమాపుదాం



ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పాల్గొన్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరిటౌన్: బాలకార్మిక నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భువనగిరిలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, యజ మానులపై కేసులు నమోదు చేయడంతో పాటు రెండేళ్ల జైలుశిక్ష, రూ.50వేల జరిమానా ఉంటుందన్నారు. బాల కార్మిక చట్టాలపై అవగాహన కల్పించేందుకు గ్రామాలు, పట్టణాల్లో సదస్సులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాగిరెడ్డి, రమణి, మోయిజుద్దీన్, సీడీపీఓ శైలజ, బాలల పరిరక్షణ విభాగం, విద్యాశాఖ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యలు పరిష్కారం

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి: భూ భారతి చట్టంతో భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ హనుమంతరావు పేర్కొన్నారు. శుక్రవారం భువనగిరి మండలంల పెంచికల్‌పహాడ్‌లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని పరిశీలించారు.రెవెన్యూ అధికారులు భూ రికార్డులతో సదస్సులకు హాజరై వీలైన సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపుతున్నారని పేర్కొన్నారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, సహాయ, సహకారాలు అందజేయటానికి హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అంతకుముందు రైతులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంజిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సుకు వచ్చిన వృద్ధ రైతు దంపతులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

మూడు నెలలు ఆగాల్సిందే..

- మే 20 తర్వాత మంజూరైన కార్డులకు సెప్టెంబర్‌లోనే రేషన్ బియ్యం
- ప్రస్తుత కోటా 65 శాతం పంపిణీ పూర్తి
- 1,640 మంది కార్డుదారులకు తప్పని నిరీక్షణ

భువనగిరి: కొత్తగా రేషన్‌కార్డులు మంజూరైన లబ్ధిదారులు బియ్యంకోసం మూడు నెలలు ఆగాల్సిందే. జూన్, జూలై, ఆగస్టు మాసాలకు సంబంధించిన బియ్యాన్ని ఒకేసారి ఈనెలలోనే పంపిణీ చేస్తున్నారు. మే 20వ తేదీ కంటే ముందు కార్డులు పొందిన వారికి కోటా ప్రకారం ప్రభుత్వం బియ్యం కేటాయించింది. దీంతో మే 20 తర్వాత కార్డులు పొందిన లబ్ధిదారులకు సెప్టెంబర్‌లో బియ్యం అందనున్నాయి.

13,587 మెట్రిక్ టన్నుల బియ్యం అలాట్

జిల్లాలో కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజాపాలన, గ్రామసభలు, మీ సేవ కేంద్రాల ద్వారా 1,96,105 దరఖాస్తులు వచ్చాయి. మీసేవల్లో వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి కార్డులు మంజూరు చేస్తున్నారు. ఈ ప్రక్రియ ఏప్రిల్ నెల నుంచి మొదలైంది. పాతవి, కొత్త కార్డులు కలిపి మే 20వ తేదీ నాటికి జిల్లాలో 2,18,963 కార్డులు, 7.09 లక్షల యూనిట్లు ఉన్నాయి. మూడు నెలలకు సంబంధించి 13,587 మెట్రిక్ టన్నుల బియ్యం కోటాను ప్రభుత్వం కేటాయించగా.. ప్రస్తుతం కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు.



1,640 దరఖాస్తులు

మే 20వ తేదీ తర్వాత 1,640 కార్డులు జారీ అయ్యాయి. ఇందులో 3,250 యూనిట్‌లు ఉన్నాయి. వారందరికీ సెప్టెంబర్‌లోనే రేషన్ బియ్యం అందనున్నాయి.లబ్ధిదారులకు ఒకేసారి పంపిణీ చేస్తున్న మూడు నెలల బియ్యం పంపిణీ 65 శాతం పూర్తయినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- జెడ్పీ సీఈఓ, డీఈఓ

భువనగిరి: ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని, నాణ్యమైన విద్య అందుతుందని జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఈఓ సత్యనారాయణ పేర్కొన్నారు. భువనగిరి మండలం తాజ్‌పూర్ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఆర్‌ఎస్‌కే ఫౌండేషన్ అధినేత డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ సొంత ఖర్చుతో డిజిటల్ తరగతి గదిలో ఏర్పాటు చేసిన స్మార్ట్ టీవీలను శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, డిజిటల్, ఆంగ్లమాధ్యమంలో చదువు చెబుతున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ర్యాకల శ్రీనివాస్‌ను జెడ్పీ సీఈఓ, డీఈఓ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, ఎంపీఓ దినకర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, మాజీ ఉపసర్పంచ్ ర్యాకల సంతోష్‌శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డిజిటల్ తరగతి గదిలో ఏర్పాటు చేసిన స్మార్ట్ టీవీని ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈఓ, డీఈఓ

ఇళ్ల నిర్మాణాలకు ముగ్గు

రాజాపేట : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సునంద పేర్కొన్నారు. శుక్రవారం రాజాపేట మండలంలోని బసంతపురం, రేణికుంట, రాజాపేట గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాల కోసం ముగ్గు పోశారు. ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయడం వల్ల ప్రభుత్వం నుంచిరుణం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శాంతినిర్మల, ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ ఆవుల కిషన్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన బిల్లులకు మోక్షం

- ఏప్రిల్ వరకు బకాయిలు విడుదల
- వంట కార్మికుల వేతనం కూడా..

భువనగిరి: పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఊరట లభించింది. గత విద్యా సంవత్సరానికి సంబంధించి బకాయి బిల్లులను ప్రభుత్వం పూర్తిగా విడుదల చేసింది. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో బిల్లులు విడుదల కావడం, ఖాతాల్లో డబ్బులు జమ అవుతుండడంతో భోజన పథకం నిర్వాహకులు, వంట కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూ.60లక్షలు మంజూరు

1నుంచి 8 తరగతులకు సంబంధించిన భోజన బిల్లులు మే నెలలో విడుదల కాగా.. 9,10 తరగతుల బకాయి బిల్లులు జనవరి నుంచి ఏప్రిల్ వరకు పూర్తిగా ప్రభుత్వం విడుదల చేసింది. ఒక్కో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి వంట మహిళ, సహాయకురాలు కలిపి ఇద్దరు లేదా నలుగు చొప్పున సుమారు 1,270 మంది ఉన్నారు. వంట ఏజెన్సీ నిర్వాహకులతో పాటు వంట కార్మికుల వేతనం కూడా విడుదలైంది. మొత్తం రూ.60 లక్షలు మంజూరు కాగా వారి ఖాతాల్లో జమ అయ్యాయి.

నేత్రపర్వంగా ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట: యాదగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాతం సేవతో నిత్యపూజలు ఆరంభించిన అర్చకులు.. గర్భాలయంలోని సువర్ణ ప్రతిష్టా అలంకార కవచమూర్తులను బంగారు పుష్పాలతో అర్చించారు. స్వయంభువులను వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను ఆగమ శాస్త్ర రీతిలో నిర్వహించారు.సాయంత్రం వేళ ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాల్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవం కనుల పండువగా చేపట్టారు. అమ్మవారిని దివ్యమనోహరంగా అలంకరించి ఊంజల్ సేవలో తీర్చిదిద్ది తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో వేదమంత్ర పఠనాలతో ప్రత్యేక పూజలు చేశారు.



ఆండాళ్ అమ్మవారి సేవను ఆలయ తిరు వీధిలో ఊరేగిస్తున్న అర్చకులు

అవగాహన కల్పించి.. సందేహాలు తీర్చి

85 గ్రామాల్లో 4,738 మంది రైతులతో మమేకమైన శాస్త్రవేత్తలు

- మెరుగైన సాగు పద్ధతులపై అవగాహన
- కర్షకుల ప్రశ్నలకు సమాధానం
- ముగిసిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

భువనగిరి: వ్యవసాయాన్ని లాభసాటి చేయాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం ముగిసింది. మే 5న ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈనెల 13వ తేదీ వరకు 40 రోజుల పాటు కొనసాగింది. ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యానవన, ఆయిల్‌ఫెడ్, భూగర్భ జలవనరుల శాఖ అధికారులను ప్రభుత్వం భాగస్వాములను చేసింది. వీరంతా ఆరు బృందాలుగా ఏర్పడి ఎంపిక చేసిన గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. మెరుగైన సాగు పద్ధతులకు సంబంధించి ఆరు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

ఈ అంశాలపై అవగాహన

- అవసరానికి మించి యూరియా వాడుతున్నారని, దాని వాడకం తగ్గించాలి. యూరియా వాడడం వల్ల లాభ, నష్టాలపై వివరించారు.
- అధిక దిగుబడుల కోసం రైతుల అవసరానికి మించి రసాయనానలు వాడుతున్నారు. దాని ప్రభావం వాతావరణం, రైతుల ఆరోగ్యం పడుతుంది. అదే కాకుండా పెట్టుబడుల వ్యయం కూడా పెరుగుతుందన్నారు.
- విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి. సాగు కాలం ముగిసేదాకా రశీదును భద్రపర్చుకోవాలి. రశీదు ఉండటం వల్ల విత్తనాలు, పురుగు మందుల కారణంగా నష్టపోతే పరిహారం పొందవచ్చని సూచించారు.
- వరి సాగుకున నీటిని ఎక్కువగా వాడకూడదు. రెండు, మూడు రోజులకు ఒకసారి పొలంలో తడి ఉంటే సరిపోతుందన్నారు.
- పంట మార్పిడి చేయాలి. రాష్ట్రంలో 95 మంది రైతులు వరి, పత్తి సాగు చేస్తున్నారని.. పంట మార్పిడి వల్ల సుస్థిర ఆదాయం పొందడమే కా కుండా భూమి సారం కోల్పోకుండా ఉంటుందన్నారు.
- నీటి వృథా చేయవద్దు. నీటి సంరక్షణ చర్యలు పాటించి భవిష్యత్ తరాలకు నీటి ముప్పు రాకుండా చూడాలి.



బొమ్మాయిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో సాగు విధానాలపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

రైతుల నుంచి మంచి స్పందన వచ్చింది



రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి రైతుల నుంచి మంచి స్పందన లభించింది. రైతులు స్వచ్ఛందంగా తరలివచ్చి సాగు విధానాల గురించి తెలుసుకోవడంతో పాటు తమ సందేహాలను వ్యక్తపరిచారు. శాస్త్రవేత్తలు వారి సందేహాలను నివృత్తి చేశారు. మెరుగైన సాగు పద్ధతులు, విత్తన ఎంపిక, ఎరువుల వాడకంపై తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే రైతులను సన్నద్ధం చేయటానికి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించాం.

-అనిల్‌కుమార్, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త

విత్తన ఎంపిక, ఎరువుల వాడకంపైనే అధికం..

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. ఎంపిక చేసిన 85 గ్రామాల్లో 4,738 మంది రైతులు హాజరయ్యారు. ఇందులో పురుషులు 3,981, మహిళా రైతులు 757 మంది ఉన్నారు. నూతన సాగు పద్ధతులు, సాంకేతిక పరికరాలు, విత్తన ఎంపిక, ఎరువుల వినియోగం తదితర అంశాలపై ప్రశ్నలు వేశారు. ముఖ్యంగా నకిలీ విత్తనాలతో నష్టపోతున్నామని, సమస్యను ఎలా అధిగమించాలని ఎక్కువ మంది రైతులు కోరారు. అలాగే ఏ పంటకు ఏ సమయంలో, ఎటువంటి ఎరువులు వాడాలి, ఎలా వినియోగించాలని ప్రశ్నలు వేశారు. రైతుల సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు.

క్లుప్తంగా

సైనిక్ గురుకుల కళాశాల విద్యార్థిని ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా ఎంపిక


కావ్య

బీబీనగర్: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సైనిక్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల 2021–2024 బ్యాచ్ విద్యార్థిని వి.కావ్య ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు.ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.జూన్ 28వ తేదీన దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ కార్యాలయానికి వెళ్లి విధుల్లో చేరనున్నారు. కళాశాల నుంచి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు ఎంపికైన మొదటి విద్యార్థి కావ్య అని ప్రిన్సిపాల్ తెలిపారు. కావ్యను ప్రిన్సిపాల్ శ్రీలత, కళాశాల కార్యదర్శి వర్షిణి, సహాయ కార్యదర్శి పీఎస్ఆర్ శర్మ, ఉప కార్యదర్శి రజిని, అధ్యాపకులు అభినందించారు.

వాట్సాప్ గ్రూపులో తప్పుడు పోస్టు చేసిన వారిపై కేసు

మోత్కూరు : మండలంలోని ముశిపట్ల గ్రామ వాట్సాప్ గ్రూపులో కాంగ్రెస్ నాయకులపై తప్పుడు పోస్టు చేసిన వారిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.నాగరాజు తెలిపారు. వివరాలు.. ఈ నెల 6న మావూరి ముచ్చట్లు (ముశిపట్ల) గ్రూపులో కాంగ్రెస్ నాయకులపై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ నేర్లకంటి శ్రీనివాస్, బోనగిరి హరీష్ పోస్టు చేశారు. ఆ గ్రామానికి చెందిన నిమ్మల రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

నకిరేకల్ : చందుపట్లకు చెందిన కొప్పు పెద్ద శ్రీను(44) గీత కార్మికుడు రోజువారీ మాదిరిగా తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో గాలి రావడంతో చెట్టు కూలిపోయి కిందపడి గాయపడ్డాడు. శ్రీనును కుటుంబ సభ్యులు హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

యాదగిరికొండ సర్కిళ్లకు దేవుళ్ల పేర్లు


శ్రీరామానుజ సర్కిల్


మల్లాపురం వెళ్లే దారిలో యాదర్షి సర్కిల్


ప్రెసిడెన్షియల్ సూట్, కల్యాణకట్టకు వెళ్లే దారిలో గరుడ సర్కిల్

- తిరుమల తరహాలో నామకరణం
- యాదగిరి కొండ చుట్టూ నాలుగు సర్కిల్స్
- దేవుళ్ల విగ్రహాల ఏర్పాటుకు సన్నాహాలు

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కొండ చుట్టూ ఉన్న రింగ్ రోడ్డు మరొక ఆధ్యాత్మిక కేంద్రంగా నిలువబోతుంది. ఇప్పటికే కొండ చుట్టూ రింగ్ రోడ్డు నిర్మించి, అందులో సర్కిల్స్, గ్రీనరీ ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులు స్వామివారిని దర్శించుకుని రింగ్ రోడ్డులో ఆయా సర్కిల్స్‌లో సేదతీరేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగానే తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్లే క్రమంలో ఉన్న సర్కిల్స్‌కు ఏవిధంగా అయితే నామకరణాలు చేశారో.. ఇప్పుడు యాదగిరి కొండ కింద ఉన్న సర్కిల్స్‌కు సైతం దేవుళ్ల పేర్లను అధికారులు పెట్టారు.

మూడు, నాలుగు నెలల్లో విగ్రహాల ఏర్పాటు..

తిరుమల తిరుపతి తరహాలోనే యాదగిరి కొండకు దిగువన ఉన్న సర్కిల్స్‌కు నామకరణం చేశారు. ఇందులో వైకుంఠద్వారం వద్ద ఉన్న సర్కిల్‌కు శ్రీ అభయాంజనేయ, ప్రెసిడెన్షియల్ సూట్ వెళ్లే దారిలో ఉన్న సర్కిల్‌కు గరుడ, కొండపైకి వెళ్లే ఎగ్జిట్ ఫ్లై ఓవర్ (ప్రస్తుతం మూడో ఘాట్‌రోడ్డు ప్రారంభంలో) వద్ద ఉన్న సర్కిల్‌కు రామానుజ, యాదగిరిగుట్ట నుంచి మల్లాపురం వెళ్లే దారిలో ఉన్న సర్కిల్‌కు యాదర్షిగా నామకరణం చేశారు. ఈ నామకరణం చేసిన సర్కిళ్లలో ఆయా దేవుళ్ల విగ్రహాలను సైతం ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఈఓ వెంకట్రావ్ ఆలయ అర్చకులు, స్తపతులతో వాస్తు, ఆగమశాస్త్ర అంశాలపై చర్చించారు. మూడు, నాలుగు నెలల్లో విగ్రహాల ఏర్పాటు పూర్తి చేస్తామని ఈఓ చెబుతున్నారు.

రింగ్ రోడ్డులో భాగంగా..


శ్రీ అభయాంజనేయ సర్కిల్‌గా నామకరణం చేసిన వైకుంఠద్వారం సర్కిల్

యాదగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధి, పునః నిర్మాణంలో భాగంగా కొండ చుట్టూ సుమారు 5.2 కిలోమీటర్ల రింగ్ రోడ్డును విస్తరించారు. ఇందుకుగాను గత ప్రభుత్వం రూ.235.7 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇందులో భూ సేకరణతోపాటు రింగ్ రోడ్డు విస్తరణ, ఎంట్రీ, ఎగ్జిట్ ఫ్లైఓవర్స్, గ్రీనరీ, డ్రైనేజీతోపాటు నాలుగు దిక్కులు నాలుగు సర్కిళ్ల ఏర్పాటుకు ఈ నిధులు ఖర్చు చేశారు. వైకుంఠద్వారం, మల్లాపురం వెళ్లే రహదారి, కొండపైకి ఎక్కడానికి ఏర్పాటు చేసిన మూడో ఘాట్ రోడ్డు, ప్రెసిడెన్షియల్ సూట్‌కు వెళ్లే మార్గంలో ఈ సర్కిళ్లను ఏర్పాటు చేసి, అందులో రకరకాల పుష్పాలతో భక్తులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దారు. ఈ సర్కిళ్లకే దేవుళ్ల పేర్లు పెట్టారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా..

స్వామివారి క్షేత్రానికి వచ్చిన భక్తులు ఆయా సర్కిల్స్ వద్ద ఆగిపోతున్నారు. వైకుంఠద్వారం నుంచి రింగ్ రోడ్డు చుట్టూ తిరుగుతూ ఆలయానికి, కల్యాణకట్ట, పుష్కరిణి, అన్నదాన సత్రం, తులసీ కాటేజీ వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే దారి తెలియక, రింగ్ రోడ్డులో ఏ సర్కిల్ వద్ద ఉన్నామో తెలియక తికమక పడుతున్నారు. దీంతో ఆలయ ఈఓ వెంకట్రావ్ రింగ్ రోడ్డులో ఉన్న సర్కిల్స్ కు వివిధ దేవుళ్ల పేర్లు పెడితే భక్తులు ఎక్కడ ఉన్నారో తమ కుటుంబ సభ్యులకు తెలిపేందుకు సులువుగా ఉంటుందని సర్కిల్స్‌కు నామకరణం చేశారు. వైకుంఠద్వారం వద్దకు వచ్చిన వారికి ఏ సర్కిల్ వద్దకు వెళ్తే ఏ ప్రాంతానికి వెళ్తాం అనే వివరాలు సులువుగా తెలిసే అవకాశం ఉంది.

కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన ఉపాధ్యాయుడు

మోత్కూరు : మోత్కూరు పట్టణానికి చెందిన దాసరి వెంకన్న జనగామ జిల్లా దేవరుప్పుల మండలం దరావత్ తండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. పాఠశాలలు పునః ప్రారంభమైన సందర్భంగా తన కుమారుడు రాహుల్‌ను శుక్రవారం మోత్కూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 6వ తరగతిలో చేర్పించాడు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని, విద్యార్థి సంపూర్ణ మనో వికాసానికి దోహద పడే బోధన ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉంటుందని వెంకన్న చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి విద్యార్థి రాహుల్‌కు అడ్మిషన్ అందజేశారు. కాగా, రాహుల్ 5వ తరగతి వరకు ప్రైవేట్ పాఠశాలలో చదివాడు.


పాఠశాల వద్ద కుమారుడితో ఉపాధ్యాయుడు దాసరి వెంకన్న

ట్రాన్స్‌కో, డిస్కమ్ ఇంటర్ సర్కిల్ కబడ్డీ విజేత నల్లగొండ

హన్మకొండ: తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ 2025–2026 శుక్రవారం ముగిసింది. కబడ్డీ ఫైనల్‌లో నల్లగొండ, వరంగల్ జట్లు పోటీపడగా నల్లగొండ జట్టు విజేతగా నిలిచింది. వరంగల్ జట్టు ద్వితీయ స్థానం, నిజామాబాద్ తృతీయ స్థానంలో నిలిచాయి. కబడ్డీ పోటీల్లో 12 జట్లు, బాల్ బ్యాడ్మింటన్‌లో 9 జట్లు పాల్గొన్నాయి. బాల్ బ్యాడ్మింటన్ ఫైనల్‌లో వరంగల్, మహబూబ్‌నగర్ జట్లు పోటీ పడగా వరంగల్ సర్కిల్ విద్యుత్ ఉద్యోగుల జట్టు విజేతగా నిలిచింది. మహబూబ్‌నగర్ జట్టు ద్వితీయ స్థానంలో, నల్లగొండ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి.


కబడ్డీలో మొదటి బహుమతి అందుకుంటున్న నల్లగొండ జట్టు

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

నల్లగొండ, తిప్పర్తి : జిల్లా కేంద్రం సమీపంలో రైలు కింద పడి ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. నల్లగొండ పోలీసులు, రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం.. నిడమనూరు మండలం ముప్పారం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ గోశెట్టి నిషాంత్ వారం క్రితం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. దీంతో గురువారం సాయంత్రం నిషాంత్ తల్లిదండ్రులు నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా శేశరాజుపల్లి సమీపంలోని రైల్వే ట్రాక్ దగ్గర రైలు కింద పడి నిషాంత్ ఆత్మహత్య చేసుకున్నాడు. నిషాంత్ రెండేళ్ల క్రితం మేన మరదలిని రెండో వివాహం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారికి ఏడాది వయసు ఉన్న బాబు ఉన్నాడు.

హిజ్రాను మొదట పెళ్లి చేసుకున్న నిషాంత్..

నిషాంత్ కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో ఓ హిజ్రాతో పరిచయం ఏర్పడి పెళ్లి చేసుకుని స్వగ్రామానికి తీసుకురాగా తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. ఈ క్రమంలోనే నిషాంత్, హిజ్రాకు మధ్య ఘర్షణ ఏర్పడింది. దీంతో అప్పట్లో హిజ్రా అమీర్‌పేటకు వెళ్లి ఆత్మహత్య చేసుకుంది. హిజ్రాలంతా కలిసి హిజ్రా మృతదేహాన్ని తీసుకొచ్చి నిడమనూరు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. అయితే ఈ మధ్యనే కేసు కొట్టేశారని నిషాంత్ బంధువులు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. నిషాంత్ చావుకు కుటుంబ కలహాలే కారణమా.. గతంలో ఆత్మహత్య చేసుకున్న హిజ్రా కుటుంబంతో ఏవైనా గొడవలు ఉన్నాయా అని పోలీసులు విచారిస్తున్నారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్

చిట్యాల: బస్సులో ప్రయాణికురాలు మరచిపోయిన హ్యాండ్‌బ్యాగ్‌ను భద్రపరిచి తిరిగి ఆమెకు అందజేసి తన నిజాయితీ చాటుకున్నాడు ఆర్టీసీ కండక్టర్ జంగయ్య. వివరాలు.. నల్లగొండ నుంచి భువనగిరి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఎల్లారెడ్డిగూడెం నుంచి చిట్యాలకు వస్తున్న యువతి తన హ్యాండ్‌బ్యాగ్‌ను మరిచిపోయి చిట్యాల బస్టాండ్‌లో దిగి వెళ్లిపోయింది. అనంతరం ఆ యువతి కార్గో సెంటర్ నిర్వాహకుడు పాలిమెర దశరథ ద్వారా కండక్టర్‌కు సమాచారం అందించింది. దీంతో హ్యాండ్‌బ్యాగును కండక్టర్ తీసుకుని తన వద్ద భద్రపరుచుకున్నాడు. వెంటనే రామన్నపేటకు వచ్చిన యువతికి కండక్టర్ జంగయ్య ఆ హ్యాండ్‌బ్యాగు అందజేసి నిజాయితీ చాటుకున్నాడు.


ప్రయాణికురాలికి హ్యాండ్‌బ్యాగ్ అందజేస్తున్న కండక్టర్ జంగయ్య

రెండు ఇళ్లల్లో చోరీ

బీబీనగర్: మండల కేంద్రంలోని ఓ కాలనీలో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. బీబీనగర్‌లోని గోకుల్‌నగర్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న ఏపీలోని తూర్పు గోదావరికి చెందిన వెంకటేష్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి నాలుగు రోజుల క్రితం ఊరికి వెళ్లాడు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి ఇంట్లో ఉన్న తులం బంగారు చైన్‌తోపాటు వెండి వస్తువులను అపహరించుకుపోయారు. వారు శుక్రవారం ఇంటికి వచ్చి చూసేసరికి దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. చోరీ జరిగిన ఇంట్లో పోలీసులు శుక్రవారం పరిశీలించి ఆధారాలు సేకరించారు. అలాగే అదే కాలనీలో చోరీ జరిగిన ఇంటి సమీపంలో పోచంపల్లి మండలంలోని ఇంద్రియాలకు చెందిన కవిత అద్దెకు ఉంటోంది. ఆమె కూడా ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి వస్తువులను చిందరవందరగా పడవేశారు. ఏమీ లభించకపోవడంతో వెనుదిరిగారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ఇంటిని పరిశీలించారు. కాగా ఇదే కాలనీలో ఇటీవల ఓ ఇంట్లో రూ.50 వేల నగదుతోపాటు బయట పార్క్ చేసి ఉన్న కారును దొంగిలించుకుపోయారు.

ఆలయంలో..

నడిగూడెం : మండల పరిధిలోని వేణుగోపాలపురం సమీపాన ఉన్న శ్రీలక్ష్మి తిరుపతమ్మ ఆలయంలో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ దారపునేని నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ తాళాలు పగులగొట్టి, ఆలయంలోని హుండీలను ధ్వంసం చేసి హుండీల్లో ఉన్న దాదాపు రూ.15 వేల నగదు చోరీ చేశారు. ఈ విషయమై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు.

ప్రమాదవశాత్తు భవన నిర్మాణ కూలీ మృతి

వలిగొండ : భవన నిర్మాణ పనికి వెళ్లిన వ్యక్తి పనిచేస్తున్న చోట ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. ఈ ఘటన వలిగొండ మండలంలోని వేములకొండలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నపాక బాబు అనే వ్యక్తి రామన్నపేట మండలంలోని ఎన్నారం గ్రామంలో నివాసం ఉంటూ భవన నిర్మాణ పనులకు దినసరి కూలీగా వెళ్తున్నాడు. చిన్నపాక బాబు గురువారం వలిగొండ మండలంలోని వేములకొండ గ్రామంలో భవన నిర్మాణ పనులకు వెళ్లి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

బైక్ ఢీకొని సీనియర్ జర్నలిస్ట్ దుర్మరణం


సత్యం (ఫైల్)

చివ్వెంల(సూర్యాపేట) : బైక్ ఢీకొట్టడంతో జర్నలిస్ట్ మృతి చెందాడు. ఈ సంఘటన చివ్వెంల మండల కేంద్రంలో సూర్యాపేట–ఖమ్మం రహదారిపై శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ చెరుపల్లి సత్యం (70) మండల కేంద్రంలోని తన ఇంటి వద్ద రహదారి దాటుతుండగా మోతె నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న బైక్ అదుపు తప్పి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సత్యం, తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం సత్యంను సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సత్యం మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నకిరేకల్: ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండలం నోముల శివారులోని ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన షేక్ సయ్యద్(52) ఆర్థిక ఇబ్బందులతో ఈ నెల 11వ తేదీన తన వ్యవసాయ భూమిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారకస్థితిలో ఉన్న సయ్యద్‌ను కుటుంబీకులు చికిత్స కోసం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సయ్యద్ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కృష్ణమాచారి తెలిపారు.

రైళ్లలో చోరీకి పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

- ఫోన్, బంగారం, నగదు స్వాధీనం

నల్లగొండ: నల్లగొండ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నిందితుడి వివరాలను ఆయన వెల్లడించారు. ఏపీలోని పల్నాడు జిల్లా గురజాల మండలం పులిపాడ్ గ్రామానికి చెందిన జమ్మిగుంపుల శ్రీకాంత్ అనే యువకుడు నల్లగొండ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 20 గ్రాముల బంగారం, ఒక మొబైల్ ఫోన్, రూ.4930 స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌పీఎఫ్ ఎస్ఐ రమణ, రైల్వే పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

వలిగొండ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన వలిగొండ మండలంలోని అక్కంపెల్లి వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. ఏపీలోని గుంటూరుకు చెందిన అనిల్ (35) అనే వ్యక్తి ఔటర్ రింగ్ రోడ్డులో టోల్గేటు వద్ద విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా పని ముగించుకుని రామన్నపేట మండలంలోని పల్లివాడలో బంధువుల ఇంటికి తన మోటారు సైకిల్‌పై వెళ్తుండగా రోడ్డుపై ఉన్న గుంతలో పడి మోటారు సైకిల్ అదుపుతప్పి అనిల్ కిందపడిపోయారు. అంతలో వెనుక నుంచి వస్తున్న లారీ అనిల్ కాలి పైనుంచి వెళ్లడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. అనిల్‌ను వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కాపర్ వైర్ చోరీ

పాలకవీడు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ కోర్‌ను దుండగులు అపహరించుకుపోయారు. ఈ ఘటన పాలకవీడు గ్రామ సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ అవసరాల కోసం పాలకవీడు గ్రామ సమీపంలో మూడు 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను అధికారులు ఏర్పాటు చేశారు. కాగా శుక్రవారం ఉదయం రైతులు పొలాల వద్దకు వచ్చి చూసేసరికి ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమై ఉన్నాయి. రైతులు వెంటనే విద్యుత్ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. విద్యుత్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. గత సంవత్సరం ఇదే సమయంలో ఇవే ట్రాన్స్‌ఫర్మర్లను ధ్వంసం చేసి అందులోని విలువైన కాపర్ సామగ్రిని దుండగులు అపహరించుకుపోయినట్లు తెలిపారు. సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు కావడంతో దొంగలు చోరీలకు పాల్పడుతున్నారని, వీటి స్థానంలో 75 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థినిపై కోతుల దాడి

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన మూడో తరగతి చదువుతున్న విద్యార్థిని గుండోజు విజయలక్ష్మి శుక్రవారం తన స్నేహితులతో కలిసి పాఠశాలకు వెళ్తుండగా మార్గమధ్యలో విజయలక్ష్మిపై కోతులు దాడి చేశాయి. దీంతో ఆ చిన్నారి స్వల్ప గాయాలపాలైంది. ప్రథమ చికిత్స అనంతరం త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చిన్నారిని వైద్యం కోసం తరలించారు.

తాటిచెట్టు ఎక్కడం ఇక సులువే..


తాటిచెట్టు ఎక్కుతున్న రాగటి ఆనంద్


తాటిచెట్టు ఎక్కేందుకు కోకోనట్ క్లైంబర్‌ను తీసుకెళ్తున్న గీత కార్మికుడు రాగటి ఆనంద్

ఆత్మకూరు(ఎం): యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం కామునిగూడెం గ్రామానికి చెందిన గీత కార్మికుడు రాగటి ఆనంద్ ‘కోకోనట్ క్లైంబర్’ (కొబ్బరిచెట్లు ఎక్కే పరికరం) సహాయంతో తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తున్నాడు. తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులో దీనిని తయారు చేయించి తీసుకొచ్చాడు. యూట్యూబ్‌లో చూసి తెచ్చుకున్నానని, ఈ పరికరం ఐదు కిలోల బరువు ఉంటుందని, దీని ధర రూ.10,600 ఉందని ఆనంద్ చెప్పాడు. ఒక చెట్టు నుంచి మరో చెట్టు వరకు మోకును తీసుకెళ్లినట్టే సులభంగా తీసుకెళ్లవచ్చని, గీత కార్మికులకు రక్షణగా ఉంటుందని వివరించాడు.

దోపిడీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

- పరారీలో మరో నిందితుడు

చౌటుప్పల్ : ప్రయాణికురాలిని తమ వాహనంలో ఎక్కించుకున్న ముగ్గురు వ్యక్తులు మార్గమధ్యలో దారి దోపిడీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఈ నెల 9న చోటుచేసుకోగా అందుకు సంబంధించిన ఇద్దరు నిందితులు శుక్రవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో పోలీసులకు చిక్కారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. కేసుకు సంబంధించిన వివరాలను సీఐ మన్మథకుమార్ శుక్రవారం వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బాటసింగారం శివారులో సింగరేణి కాలనీకి చెందిన చింతల ఉపేంద్రమ్మ (61) ఈ నెల 9న సూర్యాపేటలో ఉన్న తన బంధువుల ఇంటికి వెళ్లేందుకు జాతీయ రహదారిపై బస్సు కోసం నిలబడింది. కొంతసేపటి తర్వాత హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న ఓ నంబర్‌ప్లేటు లేని ఆటోను ఆపింది. తనను చౌటుప్పల్ బస్‌స్టేషన్ వద్ద దింపాలని అడిగింది. బస్‌చార్జీతో సమానంగా చెల్లిస్తే దింపుతామని చెప్పగా ఆమె అంగీకరించింది. దాంతో వారు ఆమెను ఆటో ఎక్కించుకున్నారు.

మార్గమధ్యలో దోపిడీకి పాల్పడిన నిందితులు

ఉపేంద్రమ్మ ఆటోలో ఎక్కిన సమయంలో అప్పటికే ఆటోలో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. అదును కోసం ఎదురుచూసిన నిందితులు బాటసింగారం నుంచి ఎల్లగిరి క్రాస్ రోడ్డు వద్దకు రాగానే ఆటోను సర్వీస్ రోడ్డు నుంచి 100 మీటర్ల దూరం తీసుకెళ్లారు. అనుమానించిన ఉపేంద్రమ్మ వారిని ప్రశ్నించింది. ఏదో జరుగుతుందని భావించిన ఆమె బిగ్గరగా అరవడం ప్రారంభించింది. దాంతో ఆటోలోని ఓ వ్యక్తి ఆమె నోటిని మూయగా మిగిలిన ఇద్దరు ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల విలువైన బంగారు గొలుసు లాక్కున్నారు. అనంతరం ఆమెను ఆటో నుంచి బయటకు నెట్టేసి అక్కడి నుంచి ఆటోతో పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం చౌటుప్పల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద తనిఖీలు చేస్తుండగా ఇద్దరు నిందితులు పట్టుబడ్డారు. వారిని రంగారెడ్డి జిల్లా బైరామల్‌గూడలో నివాసం ఉండే నల్లగొండ జిల్లా చందంపేట మండలం తేల్దేవులపలి గ్రామానికి చెందిన రమావత్ రాము(21), రంగారెడ్డి జిల్లా మీర్‌పేట గాయత్రినగర్‌లో నివాసం ఉండే చందంపేట మండలం జగ్నాతండాకు చెందిన నేనావత్ గోపాల్(30)గా గుర్తించారు. మరో నిందితుడైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లా ఊట్కూర్ గ్రామానికి చెందిన గజ్జల సమరసింహారెడ్డి(24) పరారీలో ఉన్నాడు. ఈ మేరకు నిందితులను కోర్టులో హాజరుపరిచారు. అనంతరం నల్లగొండ జైలుకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.